

ఉష్ణోగ్రత
గరిష్ఠం 40.3
కనిష్ఠం 19.9

ప్రముఖ చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ధ్వజారోహనం, రాత్రి శేషవాహనంపై స్వామివారిని ఊరేగించారు. దీంతో ఆలయ పరిసరాలు గోవిందనామస్మరణతో మార్మోగాయి. ఈ ఏడాది గరుడ ప్రసాసం పంపిణీ ఉండదని రంగరాజన్ తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

- మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)

కమనీయం.. రుక్మిణీ మాధవుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కడ్తాల మండలం బాలాజీనగర్ తండా సమీపంలోని ధనరాశి పర్వతంపై గల శ్రీ రాధా కృష్ణ ఆలయంలో మంగళవారం శ్రీ రుక్మిణీమాధవుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణతంతును వీక్షించారు. కల్యాణోత్సవంలో తిరుపతికి చెందిన జైబాలాజీ మహారాజ్, సత్యం మహారాజ్, విఠల్ మహారాజ్, నాంపల్లికి చెందిన రాజారామ్ గురు స్వామి, పలువురు స్వామిజీలు హాజరయ్యారు. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, అంకుశ్‌మహారాజ్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ బంజార మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణనాయక్, ప్రకాశ్‌నాయక్, పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ కమ్లీబీచ్యనాయక్, ఆలయ నిర్వాహకుడు డాక్టర్ రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు.

కడ్తాల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)

ఘనంగా చిలుకూరు ఆలయ బ్రహ్మోత్సవాలు



శేషవాహన ఊరేగింపులో ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, భక్తులు



రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు

» 'రాజీవ్ యువ వికాసం'పై కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకునేందుకు రేషన్ కార్డు ఉంటే సరిపోతుందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పథకం అమలుపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 14వ తేదీ వరకు ఉన్నదని తెలిపారు. అన్ని మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నోడల్ అధికారులుగా ఉన్నారని, బ్యాంకు మేనేజర్లు రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



నిధులు విడుదల చేయాలి

చిన్న చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు త్వరితగతిన నిధులు విడుదల చేయాలి. ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్, పీజీ కళాశాలలు, ఐటీ కంపెనీలు, ఎన్‌ఎస్‌జీ, ఆక్టోపస్ లాంటి రక్షణ సంస్థలు కూడా ఉన్నాయి. ఈ చెరువుకు పర్యాటక హంగులు కల్పిస్తే సౌకర్యంగా ఉంటుంది. చెరువులో ఆక్రమణలు జరగకుండా ఉంటాయి.

- పడమటి సాయిపూజ, ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం చెరువు

వదిలేస్తారా.. వన్నె తెస్తారా?

ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణకు బ్రేక్!

కంపు కొడుతున్న చిన్న చెరువు
ఎఫ్‌టీఎల్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలు
పట్టించుకోని అధికారులు, పాలకులు

కులీకుతుబ్‌షాహీల కాలంలో నిర్మితమై చారిత్రక నేపథ్యం ఉండి సుమారు ఒకటిన్నర టీఎంసీలతో 42 అడుగుల లోతుతో ఉన్న ఇబ్రహీంపట్నం చెరువు ఇట్టే ఆకర్షిస్తుంది. మూడు కిలోమీటర్ల పొడవున్న కట్ట, రెండు ప్రధాన తూములు రాచరికపు దర్పాన్ని ప్రదర్శిస్తాయి. శరవేగంగా అభివద్ది చెందుతున్న ఇబ్రహీంపట్నానికి ఇది మణిహారమని చెప్పొచ్చు. అయితే.. ఈ చెరువు సుందరీకరణ ప్రకటనలకే పరిమితమవుతోంది. నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఈ చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతామని అధికారంలో ఉన్న పెద్దలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. అంతేగాక ఇక్కడి చిన్నచెరువు సైతం అభివృద్ధికి నోచుకోక చిన్నబోయింది.

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ, బోటింగ్ సౌకర్యం, రెస్టారెంట్ వంటివి నిర్మించడానికి రూ.18 కోట్లతో ప్రణాళికలు రూపొందించి మొదటి విడతగా రూ.9 కోట్లు విడుదల చేశారు. పనులు మొదలు పెట్టిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అది అక్కడితోనే ఆగిపోయింది. 45 ఏళ్ల చరిత్రలో 2022లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు నిండి అలుగు పారింది. కాగా, ఆయకట్టుకు నీరు వదలకుండా నిల్వ చేయడంతో రెండేళ్లపాటు వర్షాలు సరిగాలేకపోయినా, చెరువుకు వరదనీరు రాకపోయినా నేటికీ 20 అడుగల మేర నీటిమట్టం ఉంది. ఇప్పటికీ మత్స్యకారుల కుటుంబాలు చెరువులో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నాయి. ఇంతటి ప్రాచుర్యం ఉన్న ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వందకు పైగా అక్రమ కట్టడాలు వెలిశాయి. గతేడాది హైడ్రా అధికారులు ఈ చెరువును సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. దీనిపై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి ఓ నివేదిక పంపినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్లానింగ్ లేకుండా పార్కు నిర్మాణం



చిన్న చెరువు వద్ద పార్కు పరిస్థితి

ఈ చెరువులో భాగంగా ఉన్న చిన్న చెరువు వద్ద రూ.35 లక్షల ఖర్చుతో పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఈ పార్కులో వాకింగ్ చేసేందుకు ట్రాక్, పార్కు, వాసనలు గుబాళించే పూల మొక్కలు, మధ్యలో వాటర్ ఫౌంటేన్, లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ శాఖ సూచన మేరకు కాంక్రీట్ వాడకుండా ఇక్కడ

మిగతా 8వ పేజీలో...

కుల వివక్షపై పోరాటం చేస్తాం

» కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జ్యోతీరావు బాపూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో కుల వివక్షపై ప్రతిఘటన పోరాటాలు చేయాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. ఈ నెల 11 నుంచి 14 వరకు పూలే, అంబేడ్కర్ జనజాతర సభలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారకకేంద్రంలో జరిగిన కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటికీ పలు చోట్ల కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతుందన్నారు. కుల దురహంకార హత్యలు, సాంఘీక బహిష్కరణలు, జోగినీ వ్యవస్థలాంటివి ఉన్నాయన్నారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెలా చివరి రోజున పౌర హక్కుల పరిరక్షణ దినం నిర్వహించాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్, కార్యదర్శి ప్రకాశ్‌కారత్, నాయకులు చెన్నయ్య, ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో పోషణ పక్షం కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

యాచారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, పోషక విలువలున్న ఆహారం తీసుకోకపోతే ఆరోగ్యం పాడవుతుందని ఇబ్రహీంపట్నం సీడీపీవో వినితాదేవి అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, సిబ్బంది మెరుగైన సేవలందిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలు, గర్భిణులకు పోషకాహారం గురించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు సమస్యలను ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ తదితరులున్నారు.

కనిపిస్తే కరవడమే!



కనిపిస్తే చాలు వెంటాడి కరిచేస్తున్నాయి వీధికుక్కలు. వాటిని చూస్తేనే జనం జంకుతున్నారు. పశువులు, పందులు వంటివి కంటపడ్డాయా.. అటాక్ చేసి హతమారుస్తున్నాయి. గుంపులుగుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయందోళనకు గురి చేస్తున్నాయి. కనిపించిన పిల్లలపై దాడులు చేస్తూ గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల ముగ్గురు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని ఆదిభట్ల మున్సిపల్ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



కుక్కల నివారణకు చర్యలు చేపట్టాం. స్వతంత్ర్య అనే ప్రైవేటు ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాం. ఒక్క కుక్కపై రూ.1,600 ఖర్చు చేస్తున్నాం. ఇప్పటివరకు 1300లకు పైగా కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేయించాం. మున్సిపల్‌లో వీధికుక్కల బెడదను తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

- బాలకృష్ణ, ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్

ఆదిభట్లలో దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు
ఒకే రోజు ముగ్గురు చిన్నారులపై దాడి
బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
కుక్కల బెడద నుంచి రక్షించాలని వేడుకోలు

ఆదిభట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్‌లో 15 వార్డులున్నాయి. కొంగరకలాన్, ఎంపీ పటేల్ గూడ, బొంగ్లూర్, మంగల్‌పల్లి, రాందాస్‌పల్లి వార్డుల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఆదిభట్లలోని 1, 9, 10 వార్డుల్లో వీధి కుక్కల సంచారం తీవ్రంగా ఉంది. ఆదిభట్లలో ఒకే రోజు ముగ్గురు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. బయటకు వెళ్లాలంటే భయపడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు చిన్నారులపై దాడి

మున్సిపల్ పరిధిలో ఒకే రోజు ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. మార్చి నెలలో పల్లా రాజు కుమారుడు పునీత్(7) ట్యూషన్ నుంచి తిరిగి వస్తుండగా

మిగతా 8వ పేజీలో...

వీధి కుక్కల దాడిలో గాయపడిన సాయిపునీత్ (ఫైల్)





మరుగుదొడ్లకు తాళం!

కాలకృత్యాలు తీర్చుకునేందుకు జనం సతమతం
శంకర్‌పల్లిలో నెలల పాటు తాళం వేసి ఉన్న టాయ్‌లెట్లు
పట్టించుకోని అధికారులు
ఉపయోగంలోకి తేవాలని ప్రయాణికుల డిమాండ్

8

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పేచీ

» గంట ఆలస్యంగా డిగ్రీ పరీక్షలు



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసేవరకు డిగ్రీ వార్షిక పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో మంగళవారం గంట ఆలస్యంగా పరీక్షలు మొదలయ్యాయి. చివరకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కుమార్ జోక్యం చేసుకుని యూనియన్ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. వారిచ్చిన హామీతో ఉదయం ఉదయం 9.30కు మొదలవ్వాల్సిన పరీక్ష గంట ఆలస్యంగా అంటే 10.30 గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యదర్శి మాదారం రమేష్ మాట్లాడుతూ మూడేళ్లుగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కళాశాల భవనాల అద్దె, అధ్యాపకుల జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 20 రోజులుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కుమార్‌ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకుంటామన్నారు. విధిలేకే పరీక్షలు బహిష్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు.

నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్

» ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. తలకొండపల్లి పరిధిలో ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వాహన తనిఖీలు నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేశారు. దుకాణాల్లో నిసేధిత గుట్కా, పాన్ పరాగ్‌లు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారముంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఎస్సై వెంకటేశ్, కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేంకటేశుడి హుండీ ఆదాయం రూ.1.06లక్షలు

పరిగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని మంగళవారం లెక్కించారు. ఇటీవల వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరిగాయి. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, కమిటీ సభ్యులు ఇగోపాల్, సురేఖ, ఈవో శ్రీనివాస్, పరిశీలకులు బాలనర్సయ్య, ఎస్పీ బాబయ్య సమక్షంలో హుండీ లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.1,06,315 వచ్చిందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

సీడబ్ల్యూసీ సమావేశంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


సమావేశంలో చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. దేశంలో పార్టీ బలోపేతంపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి గుజరాత్ వెళ్లారు. రెండు రోజులు సమావేశాలుంటాయి.


అహ్మదాబాద్‌కు బయలుదేరిన ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం శంకర్‌పల్లిలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ... నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలన్నారు. 60సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. శంషాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి సుధీర్, గోపాల్‌రెడ్డి, శేఖర్, నర్సింలు, చంద్రయ్య, మొగులయ్య, రాజు, రాములు, నర్సింలు, సాయిలు ఉన్నారు.


శంకర్‌పల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్వహణ లేక నిరుపయోగం

● నాగారంలో మరుగుదొడ్లకు తాళం!


నాగారంలోని మారుతీనగర్ ఫంక్షన్ హాల్ సమీపంలో వినియోగంలోలేని మరుగుదొడ్డి

కీసర రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ మరుగుదొడ్లు వినియోగంలో లేవు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ కరువైంది. బహిరంగ మలమూత్ర విసర్జన నియంత్రిచడం, పర్యావరణ పరిరక్షణకు రూ.లక్షలు వెచ్చించి కాలనీలు, ప్రధాన రోడ్డులో ప్రజామరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. తొలుత వాటిని బాగానే చూసినప్పటికీ కాలక్రమేణ నిర్వహణను గాలికొదిలారు. వ్యాపారులకు దుర్వాసన వస్తోందని నా గారం ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన ఓ మరుగుదొడ్డికి తాళం వేశారు. దీంతో జనం పక్కనే ఉన్న మురుగు కాలువ వద్ద మూత్రవిసర్జన చేస్తున్నారు. చికెన్, చేపల దుకాణాల వ్యర్థాలతో వస్తున్న దుర్వాసన, మలమూత్ర విసర్జితాల కంపుతో ప్రజలు భరించలేకపోతున్నారు. నాగారం-రాంపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన మరో మరుగుదొడ్డి అలంకార ప్రాయంగా మారింది. ఇలా మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లన్నీ మూలనపడ్డాయి. వాటి నిర్వహణ శానిటేషన్ విభాగానిదని ఇంజనీరింగ్ శాఖ, ఇంజనీరింగ్ సెక్షన్‌దేనని శానిటేషన్ విభాగం వారు ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ తప్పించుకుంటున్నారు. ఈ దుస్థితిపై ప్రజలు మండిపడుతున్నారు. వివిధ పనుల నిమిత్తమై పట్టణానికి వచ్చే ప్రజలు, వాహనదారుల అత్యవసర అవసరాలను తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేక ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

నిర్వహణ లేకపోవటంతో పాటు, ప్రమాదాల్లో వాహనాలు ఢీకొని పాడవడంతో ప్రజలు మరుగుదొడ్లు వాడడం లేదు. ఇంజినీరింగ్ విభాగ అధికారులతో అంచనా వేసి మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు విస్తరణలో భాగంగా నాగారం-రాంపల్లి రోడ్డులోని టాయిలెట్స్ తొలగించాల్సిన ఉంది. వీటి స్థానంలో మరోచోట మరికొన్ని ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం.

- భాస్కర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కమిషనర్

రాజ్యాంగాన్ని పరిరక్షించేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కందుకూరు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆకులమైలారం, గుమ్మడవెల్లి తండా, మీర్కాన్‌పేటల్లో జై సంవిధాన్‌పై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తొక్కేస్తూ మతచిచ్చుతో మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడారని అన్నారు. దేశం అన్ని రంగాల్లో బలమైందని తెలియజెప్పేందుకే తమ పార్టీ ప్రజలను చైతన్యపరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, అఫ్జల్‌బేగ్, జగన్, ఢిల్లీ శ్రీధర్, అజీజ్, సురేందర్, పి.శ్రీనివాస్, మహేందర్, కుమార్, బి.పాండురంగారెడ్డి, వి.బాబు, శేఖర్, యాదగిరి, శ్రీకాంత్, సాయిలు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మీర్కాన్‌పేటలో ఘనంగా రథోత్సవం


పురవీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం మీర్కాన్‌పేటలో రథోత్సవాన్ని జరుపుకున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఏటా గ్రామంలో నాలుగు రోజులు నిర్వహిస్తారు. మంగళవారం ఏకాదశిని పురస్కరించుకొని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని రథాన్ని పూలతో అలంకరించి తెల్లవారు జామున 3:10గంటలకు రథపూజ నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి రెండు గంటల పాటు గ్రామంలోని వీధుల్లో రథాన్ని వందలాది మంది యువకులు జై శ్రీరామ్ అంటూ లాగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతిచంద్రశేఖర్, నర్సింహ, మాజీ ఎంపీటీసీ డి.రాంచందర్, సంతోష్‌కుమార్, మదన్‌పాల్‌రెడ్డి, శంకర్, క్రిష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కంపెనీ కాలుష్యంతో ప్రజల ఇబ్బందులు


మోమిన్‌పేట్ శివారులో ఓ కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ

మోమిన్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పల్లికి వెళ్లే దారిలో ఓ కంపెనీ గొట్టాల ద్వారా వెలువడుతున్న పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యంతో వేగలేకపోతున్నామని స్థానికులు వాపోయారు. కొన్ని రోజులుగా కంపెనీ వద్ద గొట్టాల ద్వారా విపరీతమైన కార్బన్‌డయాక్సైడ్ వదులుతున్నారని, అక్కడి వాతావరణం కాలుష్యంతో పొగమంచులా మారుతోందని తెలిపారు. గాలి పీల్చుకుంటే పొగ లోపలికి వెళ్తోందని, కాలుష్యంతో పొలాల్లో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక అధికారులు కంపెనీ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



భక్తిశ్రద్ధలతో నారసింహుడి కల్యాణం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని పెద్ద జానమ్మపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో వేద పండితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ధ్వజాదివాస హోమం, ధ్వజారోహణం, బలిహరణం చేశారు. సంతానం కోసం పలువురు మహిళలు గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు బాల్‌రాజ్‌గుప్తా, పరిగి వెంకటసాయీశ్వర్‌రెడ్డి, కిషోర్, కానుగు అంతయ్య, లింగారం కుమార్‌గౌడ్, రాంభూపాల్, నర్సింహులుగుప్తా, మధు, అగీరు శ్రీనివాస్, ఎండోమెంట్ ఈవో శివకుమార్ పాల్గొన్నారు.

విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలి

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య తరగతులను ప్రారంభించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని టీయూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మేనిఫెస్టులో పేర్కొన్న హామీలను అమలు చేయడంలేదన్నారు. బకాయిపడిన ఐదు వాయిదాల డీఏను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని నివేదికపై సంఘాలతో చర్చించి అమలు చేయాలని, ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు వెన్నల, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో సంతోషమే ధ్యేయం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల్లో సంతోషమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్, నాయకులు భీమ్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములు గౌడ్, మల్లికార్జున్, మహేందర్ పాల్గొన్నారు.

స్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- ఫీజు చెల్లించలేదని విద్యార్థులను లైబ్రరీలో కూర్చోబెట్టారని ఆరోపణ



విలేకరులతో ఆవేదనను వ్యక్తం చేస్తున్న శివప్రసాద్

కీసర, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫీజు చెల్లించలేదని విద్యార్థులను లైబ్రరీలో కూర్చోబెట్టారని స్కూలు వద్ద తల్లిదండ్రులు ఆందోళన చేసిన ఘటన మంగళవారం నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ వద్ద జరిగింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న గౌరీక్, మరో ఇద్దరు ఫీజు చెల్లించలేదని ప్రార్థన అనంతరం లైబ్రరీలో కూర్చోబెట్టారని గౌరీక్ తండ్రి శివప్రసాద్ తెలిపారు. ఇప్పటికే లక్ష రూపాయాల ఫీజు చెల్లించామని, కట్టాల్సిన మరో 30వేలు సర్దుబాటు చేసుకొని రాగా తమను సిబ్బంది లోనికి అనుమతించలేదని వాపోయారు. ఫీజు ఆలస్యంగా చెల్లిస్తే ఫైన్ వేస్తారని చెప్పారు. సీసీ కెమెరాలోనైనా పిల్లల్ని చూపాలని కోరినా సిబ్బంది అంగీకరించలేదన్నాడు. దీంతో శివప్రసాద్ తమ కూమారుడికి టీసీ ఇవ్వాలని కోరిన మీదట గౌరీక్‌ను బయటకు పంపారన్నారు. నిబంధనలు పాటించని ఈ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని శివప్రసాద్ అధికారులను కోరారు. ఈ ఘటనపై యాజమాన్యం స్పందిస్తూ.. ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులకు పలుమార్లు ఫోన్లు చేశామని, ఈ-మెయిల్, ఉత్తరాలు పంపామని, అయినా ఫీజు చెల్లించలేదన్నారు. తల్లిదండ్రులు తమతో మాట్లాడకుండానే పదిమందితో వచ్చి స్కూలు వద్ద ఆందోళన చేయడంతో భయాందోళనతో వారిని లోనికి అనుమతించలేదన్నారు. తండ్రి కోరిక మేరకు గౌరీక్‌కు టీసీ ఇచ్చామని తెలిపారు.

రాత్రి పూట చెరువు మట్టి దోపిడీ

- ఐదు టిప్పర్లతో డ్రైవర్ల పరార్
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

శామీర్‌పేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చెరువు, కుంటల్లోంచి రాత్రి పూట మట్టిని రవాణా చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. ఈ అక్రమ తంతు మండలంలో ఏడాదిగా కొనసాగుతోంది. రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు ఏమీ పట్టనట్టే ఉంటున్నారు. సోమవారం రాత్రి లాల్‌గడి మలకపేట కుడిచెరువు నుంచి జేసీబీ, టిప్పర్లతో మట్టి ని రవాణా చేశారు. మట్టి దొంగలు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారు సోమవారం రాత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువు వద్దకు వెళ్లగా అప్పటికే ఐదు టిప్పర్లను అక్కడి నుంచి తప్పించారు. అధికారులు చెరువు వద్ద హిటాచీ, లారీని సీజ్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టి తరలిస్తున్నవారి పట్ల మొదటి నుంచీ అధికారులు కఠిన చర్యలను తీసుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

చేవెళ్ల/కొత్తూర్/కందుకూరు,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని చేవెళ్ల సీడీపీవో హెప్సీబా తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భిణులు, పిల్లలు, బాలింతలు పోషకాహారం తినాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో షబానా బేగం సమావేశం నిర్వహించారు. గర్భిణులు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కొత్తూర్ మండలం మక్తగూడలో భాగంగా పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రేవతి, టీచర్ రజీనా, గర్భిణులు పాల్గొన్నారు. పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ తెలిపారు. కందుకూరు మండలం కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో శాంతిశ్రీ మాట్లాడారు. సూపర్‌వైజర్ ఇందిర, టీచర్ గోవిందమ్మ, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి సరికాదు

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): న్యాయవాదిపై దాడిని ఖండిస్తున్నామని న్యాయవాదులు అన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముష్తబా అలీపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆమనగల్లులో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో అడ్వకేట్లు విధులు బహిష్కరించారు. అసోసియేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అడ్వకేట్ల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు జగన్, సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, గణేశ్, సంతోష్, మల్లేశ్, దేవేందర్, శ్రీనివాస్, శిరీష్, సర్ధార్‌నాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

- రాజీవ్ రహదారిపై డీసీఎంను ఢీకొన్న టాటా సఫారీ
- ఇద్దరు మృతి.. ఐదుగురికి గాయాలు
- శామీర్‌పేట చెరువు వాగులో మునిగి ఇద్దరు యువకుల మృత్యువాత



డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన సఫారీ



యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని రెండు మండలాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు దుర్ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మూడుచింతలపల్లి మండలం తుర్కపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై టాటా సఫారీ వాహనం డీసీఎంను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. మరో ఘటనలో శామీర్‌పేట్ పెద్ద చెరువు సమీప వాగులో ఈతకు దిగిన ఇద్దరు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాలపై పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. తుర్కపల్లిలోని జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై డీసీఎం వాహనాన్ని సఫారీ కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. మురహరిపల్లి నుంచి శామీర్‌పేట్ వైపు వెళ్తున్న సఫారీ కారు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వచ్చిన డీసీఎంను ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన రాజు(18), మురహరిపల్లికి చెందిన శ్రవణ్(23) అక్కడికక్కడే మృతిచెందారు. డీసీఎం డ్రైవర్, కారులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

ఈత సరదా ఇద్దరి ప్రాణాలను బలికొంది. శామీర్‌పేట్ పెద్ద చెరువు సమీపంలోని వాగులో మంగళవారం ఈతకు దిగిన ఇద్దరు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన యశ్వంత్(24), ఏపీకి చెందిన మందకృష్ణ(35), నగరానికి చెందిన మరో ఎనిమిది మంది స్నేహితులు శామీర్‌పేట్ వచ్చి కట్టమైసమ్మ ఆలయంలో దర్శంచుకున్నారు. అనంతరం దావత్ చేసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న పెద్ద చెరువు సమీప వాగులో ఈతకు దిగారు. నీటిలో మునిగి యశ్వంత్, కృష్ణ మృత్యువాత పడ్డారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని మృతదేహాలను వెలికితీయించి పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా నగరంలో డెలివరీ బాయ్స్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

సైబర్ నేరాల నివారణకు స్పెషల్ ఫోకస్

ప్రజావగాహనకు తాండూరులో శ్రీకారం.. పోస్టర్లు, బ్యానర్ల ప్రదర్శన



సైబర్ నేరాల అవగాహనపై ప్రదర్శిస్తున్న బ్యానర్

తాండూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర వాణిజ్య కేంద్రంగా ఉన్న తాండూరు ప్రాంతంలో సైబర్ నేరాల నివారణకు పోలీసులు దృష్టిపెట్టారు. తాండూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సహకారంతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రజలు ఆర్థిక మోసాలకు గురికాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు సైబర్ క్రైంల నుంచి ప్రజలను రక్షించేందుకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 600 పెద్ద పోస్టర్ల ద్వారా ప్రచారాన్ని చేపట్టేందుకు నిర్ణయించారు.

27రకాల ఆర్థిక నేరాలు

నేడు అనేక రకాలుగా సైబర్ మోసాలు జరుగుతున్నాయి. వీటిల్లో సాధారణంగా జరిగే 27రకాల ఆర్థిక నేరాలను పోలీసు శాఖ గుర్తించింది. సైబర్ క్రైం పోస్టర్ పేరిట బ్యానర్‌ను రూపొందించారు. సైబర్ మోసానికి గురైతే ఏం చేయాలి.. మీ కార్డు బ్లాక్ అయిందని కాలొచ్చిందా? ట్రేడింగ్ యాప్‌లతో జరభద్రం, ఆన్‌లైన్ గేమింగ్‌లతో మోసం, క్రెడిట్ కార్డు వివరాలు ఎవ్వరికీ చెప్పొద్దు.. అంటూ తదితర అంశాలను బొమ్మలతో వివరిస్తున్నారు. ఫ్రాడ్ కాల్స్ ఎస్సెమ్మెస్‌లతో ఎలా జాగ్రత్తగా ఉండాలో పేర్కొంటున్నారు. వాట్సప్‌కు, మెస్సేజ్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దని సూచిస్తున్నారు. ఫోన్లకొచ్చే ఓటీపీలను ఎవ్వరికీ చెప్పొద్దని, అపరిచితులు ఫోన్ చేసి మీ అకౌంట్లోకి డబ్బులు వేస్తాం.. ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పొద్దని వివరిస్తున్నారు. ఓటీపీ(వన్ టైం పాస్‌వర్డ్) చెల్లింపులకే తప్ప డిపాజిట్లకు ఉండదని ప్రజలు గుర్తించాలని చెబుతున్నారు. మనీ ట్రాన్‌సాక్షన్ యాప్‌లు, బ్యాంకు అకౌంట్/ పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దని వివరిస్తున్నారు. ఒక వేళ మోసపోతే వెంటనే ఎలా స్పందించాలి.. ఎవరికి కాల్ చేయాలి? క్రెడిట్/డెబిట్ కార్డుల విషయంలో ఎలా వ్యవహరించాలో బొమ్మలతో పోస్టర్లు, బ్యానర్లు ముద్రించి వివరిస్తున్నారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే రక్షణ..



ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. అపరిచిత మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌ను నమ్మొద్దు. డబ్బుల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు. స్మార్ట్‌ఫోన్ల కాలంలో మోసం చేయడం నేరగాళ్లకు సులువైంది. నేరగాళ్ల నుంచి మీ డబ్బును రక్షించుకోవడం మీ చేతుల్లోనే ఉంది. మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి. దీంతో మోసగాళ్ల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్‌చేసి డబ్బు వారు డ్రా చేయకుండా చేస్తాం. అనంతరం డబ్బు పొందే వీలుంది. సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. యువత అవగాహన పెంచుకొని కుటుంబీకులకు తెలియజెప్పాలి.

బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

మోసపోకుండా అప్రమత్తం చేస్తున్నాం



సైబర్ క్రైమ్‌లపై ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు పోస్టర్లు, బ్యానర్లతో ముద్రించాం. కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో వాటిని ప్రదర్శిస్తున్నాం. దీనిపై తాండూరు ఐఎంఏ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీసులకు సహకరించేలా 600 పోస్టర్ల ముద్రించాం. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు ఏం చేయాలి? మోసానికి గురికాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నాం.

- డాక్టర్ జయప్రసాద్, ప్రెసిడెంట్, ఐఎంఏ, తాండూరు



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి(ఫైల్)

అమ్మో పాము

కొత్తూరు ఎస్సీ కాలనీలో పాముల బెడద



కొత్తూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో తరుచూ పాములు కనిపిస్తుండడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొన్నేళ్ల క్రితం ఎస్సీ కాలనీ నుంచి రైల్వే గేట్ వరకు నూతనంగా భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న రాళ్లను పక్కకు వేయడంతో కుప్పగా ఏర్పడి పాములు స్థావరంగా మారింది. రాళ్ల కుప్పను తొలగించాలని మున్సిపాలిటీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పాములు తరుచూ బయటకు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పేద కుటుంబాల్లో సంతోషమే ధ్యేయం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల్లో సంతోషమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు భీమ్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, మహేందర్ పాల్గొన్నారు.

సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తే గుర్తింపు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

మన్సూరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే ప్రతీ నాయకుడు, కార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో తగిన గుర్తింపు లభిస్తోందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సుపరిపాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పదవీ స్వీకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా కె.లక్ష్మణ్, మాల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి నాయకుడు, కార్యకర్త అర్బన్ జిల్లా బీజేపీ పటిష్టతకు పాటుపడాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాజీ సీఎం కేసీఆర్ వైఫల్యమే కారణం అని, తొమ్మిది నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎంపీ ఈటల విమర్శించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని జోష్యం చెప్పారు. తెలంగాణలో రైతులు ధైర్యంగా ఉన్నారంటే ఇందుకు మోదీ ప్రభుత్వ దీమానే కారణమని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దోచుకోవడం తప్ప బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులకు పాలించడం చేతకాదని, ఇందుకు నిదర్శనం ప్రభుత్వ భూములు అమ్ముకోవడమేనని విమర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ అదనపు ఎస్పీ మధుసూదన్‌రావు దంపతులను సన్మానిస్తున్న మిత్రులు

స్నేహితుల ప్రోత్సాహంతోనే ఎదిగా

తాండూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తనకు ప్రతీ విషయంలో చిన్ననాటి నుంచి స్నేహితులు అందించిన ప్రోత్సహంతోనే ఉన్నత స్థాయికి ఎదిగి ఉద్యోగ విరమణ చేశామని రిటైర్డ్ విజిలెన్స్ అదనపు ఎస్పీ మధుసూధన్‌రావు అన్నారు. మంగళవారం అంతారంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో తాండూరులోని స్నేహితులు, ఆత్మీయులు ఏర్పాటు చేసిన అభినందన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. తాను రిటైర్ అయినా టయర్డ్ కాలేదని చెప్పారు. తాండూరు ప్రాంతంలో పుట్టిపెరిగి ఎస్ఐ స్థాయి నుంచి అదనపు ఎస్పీ క్యాడర్ వరకు ఎదిగానని తెలిపారు. ప్రజల సహకారం మరువలేనిదన్నారు. తాను తాండూరులో చదువుకున్న విజయ విద్యాలయం, పీపుల్స్ డిగ్రీ కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీలు ఎంతో నేర్పాయన్నారు. ముఖ్య అతిథి సీనియర్ న్యాయవాది కరుణం పురుషోత్తంరావు మాట్లాడుతూ.. మధుసూధన్‌రావు ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమానికి మాజీ వైస్ ఎంపీపీ రాజప్ప అధ్యక్షత వహించారు. నాయకులు రాజ్‌కుమార్, రాజుగౌడ్, మంజుల, అన్నపూర్ణ, స్వరూప, బస్వరాజ్, సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గౌడ్, భద్రేశ్వర్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూధన్‌రావు దంపతులను గజమాలతో సన్మానించారు.

డ్యాన్స్ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం



డ్యాన్స్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కరయోగి తదితరులు

కొడంగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ, ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మాతృ నత్యం ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళవారం కొడంగల్‌లో ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కె.శివకుమార్‌గుప్తాల ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఉచిత డ్యాన్స్ తరగతులు ప్రారంభించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మురారి వశిష్ట, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణంరాజు, వైద్యుడు సాకేత్, నవీన పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, రాజేందర్, భీమారాజు, అకాడమి మాస్టర్ ప్రకాశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జైల్ భరో'ను జయప్రదం చేయాలి

పరిగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా బీఎంపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌లు కోరారు. పరిగిలో మంగళవారం జైల్‌భరోపై సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకుడు కొర్ర బాలకృష్ణ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ధారాసింగ్

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

పెద్దేముల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు అందరూ పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్‌లో మంగళవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంపై కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల ఇన్‌చార్జి ధారాసింగ్ హాజరై జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా రాజ్యాంగ పరిరక్షణకు చేపట్టిన పాదయాత్రను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌గాంధీ దేశైక్యతను చాటిచెప్పారన్నారు. బీజేపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లో ఎండగట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, గాజీపూర్ నారాయణరెడ్డి, ఎ-బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, మల్లేశం, కిరణ్, డీవై.నర్సిములు, నసీర్, మైపుస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలి



అభిషేకం చేస్తున్న శివనాగేంద్ర స్వామి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడిస్తేనే సమాజంలో శాంతి నెలకొంటుందని కాశీపీఠం పీఠాధీశులు పరమహంస శివనాగేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల శివశంకరి వేద పీఠంలో లలితా త్రిపురసుందరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల చివరి రోజు మంగళవారం ఆయన హాజరై పూజలు నిర్వహించారు. దైవభక్తితో సాధించలేనిదేదీ లేదన్నారు. అష్టోత్తర శత కలశ ఆవాహన, శతకళాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంగి తప్రభాకర్‌రెడ్డి దంపతులు, డి.జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, ప్రసాద్, శోభారాణి, సుజాత, నిర్వాహకుడు కాశీ కోటేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

'ఫంకు ఇండియా' స్కామ్‌లో ఒకరి అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తమ కంపెనీలో పెట్టుబడి పెడితే స్వల్పకాలంలో 300 నుంచి 400 శాతం లాభం వస్తుందంటూ ప్రచారం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఫంకు ఇండియా చీటింగ్ కేసులో తోకల మధుసూధన్‌ను అరెస్టు చేశామని సీఐడీ డీజీ షికా గోయల్ మంగళవారం తెలిపారు. ఫంకు ఇండియా సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రమోటర్ వందిత ద్వారా ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన తోకల మధుసూధన్ ఈ చీటింగ్ ముఠాలో ఏజంట్‌గా చేరాడని, అతడు పెట్టుబడికి తొలిదశలో భారీగా లాభమొచ్చిందని చెప్పారు. మరికొందరి ద్వారా ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టిస్తే ఒకొక్క రిఫరెన్స్ ద్వారా 11శాతం కమిషన్ చెల్లిస్తామని వందిత చెప్పడంతో మధుసూదన్ నేరేడ్‌మెట్‌లో ఓ సమావేశం ఏర్పాటు చేసి తమ కంపెనీ గురించి చెప్పి పలువురితో భారీగా పెట్టుబడులు పెట్టించాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత కంపెనీ బోర్డు తిప్పేయడంతో గత ఏడాది సీఐడీ దర్యాప్తు ప్రారంభించి మూడో నిందితుడైన మధుసూధన్‌ను అరెస్టు చేశామని ఆమె వివరించారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



- జయంత్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ ఎంపీవో

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాక మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్కీం ద్వారా ప్లాటు కోసం డబ్బులు చెల్లించి నిరీక్షిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్లు కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పింది. అందుకు ఏ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి అనే విషయమై మండల పంచాయతీ అధికారి జయంత్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: ఎల్ఆర్ఎస్ కింద ప్లాటు రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఫరూఖ్‌నగర్ మండలంలో ఎన్ని ఇప్పటివరకు దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: ఫరూఖ్‌నగర్ మండలంలో గ్రామాల నుంచి ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్లు రెగ్యులరైజ్ చేసుకోవడానికి 21వేల దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన ధ్రువపత్రాలు ఏమిటి?

జవాబు: ఎల్ఆర్ఎస్-2020 కింద దరఖాస్తు చేసుకొని ఉండాలి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ తప్పనిసరిగా ఉండాలి. 20 శాతం దరఖాస్తుదారుల ఎల్ఆర్ఎస్ పూర్తి చేశాం. ఆన్‌లైన్ సమస్య వల్ల సుమారు 3 వేల మంది వాపస్ వెళ్లిపోయారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రశ్న: నాన్ లేఅవుట్ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ ఎలా కట్టాలి?

జవాబు: 2020లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకొని ఉండాలి. అంతేగాకుండా నాన్ లేఅవుట్ వెంచర్‌లో 10 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు చేసి ఉంటే మిగతా ప్లాట్లకు అనుమతి తీసుకోవచ్చు. 10 శాతం రిజిస్ట్రేషన్ కాని నాన్ లేఅవుట్ వెంచర్‌లకు యజమాని మొత్తం ప్లాట్లకు రుసుము కట్టొచ్చని అంటున్నారు. ఈ విషయమై పూర్తి సమాచారం లేదు.

ప్రశ్న : పదిశాతం భూముల వివరాలు ఉన్నాయా?

జవాబు: తెలంగాణ యాక్ట్-2019 తర్వాత పదిశాతం భూములు ఖచ్చితంగా గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేశారు. 2018కి ముందు గ్రామ పంచాయతీలకు పది శాతం భూములు ఇవ్వలేదు.

13న తలకొండపల్లిలో భీమ్ దీక్ష ముగింపు సభ

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్వేరోస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి భీమ్ దీక్ష ముగింపు సభ ఈనెల 13న తలకొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. భీమ్ దీక్షకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లను బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్, ఉపాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. భీమ్‌దీక్ష ముగింపు సభలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మరుగుదొడ్లకు తాళం!

- కాలకృత్యాలు తీర్చుకునేందుకు జనం సతమతం
- శంకర్‌పల్లిలో నెలల పాటు తాళం వేసి ఉన్నవైనం
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- టాయ్‌లెట్లను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు, స్థానికుల డిమాండ్



బస్టాండ్ వద్ద తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు



శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన వినియోగంలో లేని మరుగుదొడ్లు, మూత్రశాలలు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మునిసిపాలిటీలో లక్షలు వెచ్చించి కట్టిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో పట్టణానికొచ్చే ప్రజలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు తప్పడం లేదు. శంకర్‌పల్లిలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్ పక్కన నాలుగేళ్ల క్రితం, బస్‌స్టేషన్ పక్కన మూడేళ్ల క్రితం మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న టాయ్‌లెట్ల నిర్వహణను గాలికొదిలేశారు. వాటిని ప్రజలు ఒక్కరోజైనా ఉపయోగించింది లేదు. మరుగుదొడ్ల నిర్మించినప్పటి నుంచి ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు మారినా వృథాగా ఉన్నా వాటి నిర్వహణపై చర్యలు తీసుకోలేదు. జనాభా, వ్యాపారపరంగా రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న శంకర్‌పల్లిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదు.

మరుగుదొడ్ల వద్ద డ్రెయిన్ తవ్వకాలు

బస్‌స్టేషన్ పక్కన ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలకు రెండు నెలల నుంచి తాళం వేశారు. శంకర్‌పల్లిలో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడంతో మరుగుదొడ్లు, మూత్రశాలల ముందు సైతం కాలువ తీశారు. కాగా, బస్టాండ్ వద్ద మురుగు కాలువ నిర్మాణం పూర్తయింది. ఇటీవల కాలువపై కప్పు కూడా వేశారు. కానీ, టాయ్‌లెట్లు వినియోగంలోకి రాలేదు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన టాయ్‌లెట్లు వినియోగంలో లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీస్‌స్టేషన్ పక్కన నిర్మించినవైతే ఒక్కరోజైనా ఉపయోగించలేదు.

బహిరంగ ప్రదేశాల్లో..

శంకర్‌పల్లిలో ప్రతీ ఆది, బుధ, శుక్రవారాల్లో అంగడి జరుగుతుంది. ఆ రోజుల్లో వేలాది మంది పట్టణానికి వస్తారు. బస్టాండ్ కూడలి, రైల్వేస్టేషన్ ఉండటంతో నిత్యం శంకర్‌పల్లికి వేలాది మంది వివిధ పనుల కోసం వస్తుంటారు. స్థానికులు, ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వారు రోడ్ల పక్కన, ఇతర ప్రైవేట్ స్థలాల్లో కాలకృత్యా లు తీర్చుకుంటుండడంతో పట్టణం మురికిమయమవుతోంది. స్వచ్ఛ-శంకర్‌పల్లి అనే విధానాన్ని మున్సిపల్ అధికారులు గాలికొదిలేశారు. దీనిపై కమిషనర్ యోగేశ్ స్పందిస్తూ రెండుమూడు రోజుల్లో బస్‌స్టేషన్ పక్కనున్న మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేలా, అలాగే పోలీస్‌స్టేషన్ సమీపంలోని మరుగుదొడ్లను సైతం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం



శంకర్‌పల్లి బస్‌స్టాండ్ పక్కనున్న మరుగుదొడ్లు, మూత్రశాలలు రెండు నెలలుగా మూతపడ్డాయి. డ్రెయిన్ల నిర్మాణం నుంచి లాక్ చేశారు. పట్టణ వాసులతో పాటు శంకర్‌పల్లికి వచ్చిపోయే వారికి ఇబ్బందిగా మారింది. అధికారులు ఇప్పటికైనా మురుగుకాలువ పైనకప్పు వేయించి మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలి.

- క్రాంతిరెడ్డి, ఆటో డ్రైవర్, శంకర్‌పల్లి

వెంటనే అందుబాటులోకి తేవాలి



ప్రజాధనంతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. మరుగుదొడ్లు, మూత్రశాలలకు తాళం వేయడంతో శంకర్‌పల్లికి వచ్చిపోయే వారు కాల కృత్యాలు తీర్చుకునేందుకు అవస్థ పడుతున్నారు. నిత్యం పట్టణానికి వేలాది మంది వచ్చీపోతుంటారు. మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి మరుగుదొడ్లను ఉపయోగంలోకి తేవాలి.

- శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు, టంగుటూరు

కనిపిస్తే కరవడమే!

(5వ పేజీ తరువాయి)

వెనకాల నుంచి వచ్చిన వీధి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి వీపుపై పెద్దగా కాట్లు పడ్డాయి. అదేరోజు పల్సా రమశ్రీ బాలికపై దాడిచేసి విచక్షణారహితంగా కరిచాయి. వీరితో పాటు అదేవార్డుకు చెందిన మహేందర్‌గౌడ్ కూతురిని కరిచి గాయపరిచాయి. గడిచిన కొద్ది కాలంలో పదులసంఖ్యలో కుక్కల దాడులు జరిగాయని మున్సిపల్ ప్రజలు చెబుతున్నారు. దీంతోపాటు ఆదిభట్లలోని రాంచంద్రయ్య విగ్రహం సమీపంలో ఓ పందిని కుక్కలు వెంటపడి మూకుమ్మడిగా దాడిచేసి చంపేశాయి. ఇదేస్థానంలో పిల్లలుంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటే భయంగా ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆదిభట్లలో పందిపై దాడిచేస్తున్న కుక్కలు(ఫైల్)

బయటకు రావాలంటేనే భయమేస్తుంది



వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూస్తే భయమేస్తుంది. నా కుమారుడు ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా దాడి చేసి గాయపరిచాయి. దాంతో ట్యూషన్, స్కూల్‌కు వెళ్లాలంటే భయపడుతున్నాడు. గతంలో వీధికుక్కల బారినుంచి కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేశాం. తాత్కాలిక చర్యలు చేపట్టినా సమస్య తీరలేదు.

- వీ.రాజు, ఆదిభట్ల

సన్నబియ్యం పంపిణీ.. పేదలకు వరం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యం పంపిణీ పేదలకు వరంలాంటిదని, దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే పథకం అని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏట్లఎర్రవల్లిలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతీఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయడం పేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నర్సింహులు, జగన్, ప్రవీణ్, నర్సింహులు, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తనీయొద్దు

- శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య

శంకర్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య తెలిపారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి కారణంగా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపికైన లబ్దిదారులను గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉద్యోగాలు పొందిన మహిళలతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల్, మాదాయిపల్లి, చౌదర్‌పల్లి, మెదక్‌పల్లి, జంగారెడ్డిపల్లి, వెల్దండ మండలం పెద్దాపూర్, కడ్తాల మండలం కర్కల్‌పహాడ్, ఆమనగల్లుకు చెందిన మహిళలకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలలో ఉ ద్యోగాలను మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 60 మంది మ హిళలు, యువతులు పాల్గొన్నారు. 14 మంది ఉద్యోగాల్లో చేరారు. మిగతావారు వచ్చేవారం ఉద్యోగాల్లో చేరుతారని సుంకిరెడ్డి చెప్పారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 11వ వార్డులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జెండా ఆవిష్కరించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్, నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహులు అతిథులుగా హాజరయ్యారు. బూత్ కమిటీ అధ్యక్షుడు బైకని అశోక్ జెండా ఆవిష్కరించారు.

వదిలేస్తారా.. వన్నె తెస్తారా?

(5వ పేజీ తరువాయి)

పార్కును తీర్చిదిద్దారు. ఇబ్రహీంపట్నం టౌన్ ఎంట్రెన్స్‌లోనే చూపరులను ఆకర్షించేలా దీనిని నిర్మించారు. ఇక్కడ టౌన్‌లో నిత్యం తెల్లవారుజామున చాలా మంది రోడ్లవెంట వాకింగ్ చేస్తున్నారు. చలికాలం మంచుకురిసే సమయంలో రోడ్డుగుండా వెళ్లే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనపడవు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వారికి, ఆడుకోవడానికి పిల్లలకు అనువుగా దీన్ని తీర్చిదిద్దారు. రెండున్నరేళ్ల క్రితం వచ్చిన వరదలకు ఈ పార్కు పూర్తిగా మునిగిపోయింది. ప్లానింగ్ లేకుండా ఇంత ఖర్చుచేసి నిర్మించిన పార్కు వృథా అయ్యిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చిన్న చెరువు వద్ద పార్కు, వాకింగ్‌ట్రాక్(ఫైల్)

కంప చెట్లు.. దుర్గంధం

చిన్న చెరువు పూర్తిగా కంప చెట్లతో నిండి ఉంది. పై కాలనీలు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే మురుగుతో ఇది దుర్గంధభరితంగా మారింది. ఇందులోనే పందుల దొడ్లు ఉండగా వీటిని మాత్రం తొలగించారు. రాత్రి వేళల్లో కోళ్ల వ్యర్థాలు పడేస్తుండడంతో తీవ్రమైన కంపు కొడుతోందని ఆరోపిస్తున్నారు.

అభివృద్ధికి అద్దం పట్టేలా తీర్చిదిద్దాలనుకున్నాం



అభివృద్ధికి అద్దం పట్టేలా రూ.18 కోట్లతో ఈ చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దాలని అప్పట్లో ప్లాన్ రూపొందించాం. మొదటి విడతగా ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన సమయంలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తిరిగి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి.

- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

'పేదలపై పెనుభారం మోపిన బీజేపీ'

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్‌తో పాటు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన బీజేపీ ప్రభుత్వం పేదలపై పెనుభారం మోపిందని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకుడు రఘునాయక్‌లు ఆరోపించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేరుల సమావేశంలో బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ముడి సరకుల ధరలు తగ్గుతుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, డీజిల్, పెట్రోల్‌పై రూ.2 ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, అందె మోహన్, అగ్గనూరి బస్వం, జి.సత్తయ్య, దిలీప్ తదితరులున్నారు.

పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం

ఆమనగల్లు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అచ్చేదిన్ అంటూ సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ ఆరోపించారు. వంటగ్యాస్ సిలిండర్ ఏకంగా రూ.50 పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్‌తో కలిసి విలేకరుల సమావేశంలో అనురాధపత్యానాయక్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సంపన్నుల కొమ్ము కాస్తూ.. పేదలను ఇబ్బందులకుగురిచేస్తుందన్నారు. అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని చెప్పి..తీరా వంట గ్యాస్, నిత్యావసర, పెట్రో ధరలు పెంచడం పేదలను మోసగించడమేనన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నాయకులు పంతూనాయక్, శ్రీనునాయక్, గుత్తి బాలస్వామి, ఎనుముల రమేశ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు అందజేత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 200 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గుర్తింపు కార్డులు అందజేశారు. క్యామ మల్లేష్ సహకారంతో ఈ కార్డులు అందజేస్తున్నట్లు పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వి.పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్ తదితరులున్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి

యాచారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను విధిగా బడిలో చేర్చాలని మంగళవారం మంతన్‌గౌరెల్లికి చెందిన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు సోమవారం ఇల్లిల్లూ తిరిగి ప్రజలను కోరారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పితే ఉచితంగా రెండు జతల దుస్తులందుతాయని, నాణ్యమైన భోజనం పెడతారని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలందిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధన చేస్తారని వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు చేయిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు తదితరులున్నారు.

వీహెచ్‌పీ మున్సిపల్ అధ్యక్షుడిగా సత్తిరాజు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడిగా పొగాకు సత్తిరాజు, కార్యదర్శిగా ముత్యాల శశాంక్‌లను నియమించినట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సొకుంట్ల శ్రీనివాస్ తెలిపారు. అలాగే భజరంగ్‌దళ్ సభ్యులుగా తాళ్ల కారుణ్య, బస్వాపురం మురళీ కార్తీక్‌లను నియమించారు.



నియామక పత్రం అందుకుంటున్న సత్తిరాజు

మహిళలకు ఉచిత యోగా శిక్షణ

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని సహారా కాలనీ వినాయక మంటపంలో మహిళలకు ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న పతంజలి యోగ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశీధర్ తెలిపారు. యోగ గురువు హరిత ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 5.00 గంటల నుంచి 6.00 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటికే పరిమితమై మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, శ్రీదేవి భూదేవిసమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవాలయాల తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. వార్షికోత్సవాల నేపథ్యంలో దేవాలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. నేటి (బుధవారం) నుంచి 11వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం నిర్వా హకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చౌదరిగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొందర్గు మండల పరిధిలోని గంగన్నగూడ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింది రాములు(35) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులో కొంత కాలంగా భార్యాభర్తల మధ్య కలహాలు మొదలై గొడవపడుతున్నారు. ఈక్రమంలో 10 రోజుల క్రితం రాములు కుమారుడికి మూత్ర విసర్జన సమస్య రావడంతో దాదాపు రూ.లక్ష ఖర్చుచేసి సర్జరీ చేయించాడు. అనంతరం భార్య కవిత ఆపరేషన్ అయిన కుమారుని వెంటబెట్టుకొని తల్లిగారింటికి వెళ్లింది. గతంలో చేసిన అప్పులతో పాటు సర్జరీకి చేసిన అప్పుతో బాధపడుతూ మద్యానికి బానిసైన రాములు సోమవారం రాత్రి తన తల్లితండ్రులు పడుకున్న తరువాత ఇంట్లోని పక్క గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుండెనొప్పితో కార్మికుడు మృతి



సురేష్‌బాబు మృతదేహం

నందిగామ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పారెడ్డిగూడ శివారులో గల వెంకటేశ్వర హేచరీస్‌లో సోమవారం రాత్రి కార్మికుడు గుండెనొప్పితో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నారాయణపేట్ జిల్లా ఉట్కూర్‌కు చెందిన సురేష్‌బాబు(58) కొన్నేళ్లుగా నందిగామ మండలం చంద్రాయన్‌గూడలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ అప్పారెడ్డిగూడ శివారులోని వెంకటేశ్వర హేచరీస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో సురేష్‌బాబుకు గుండెనొప్పి వచ్చి కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు హేచరీస్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పరిస్థితి విషమంగా ఉందని షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబసభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. కాగా, పరిశ్రమలో కార్మికులపై యాజమాన్యం పని ఒత్తిడి కలిగిస్తోందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో తగిన వసతులపై దృష్టి సారించడంలేదని ఆరోపిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

నందిగామ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధి చాకలిగుట్ట తండా సమీపంలోని బైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు చెందిన తుపాకుల ఆంజనేయులు(48) మతిస్థిమితం కోల్పోయి భిక్షాటన చేస్తూ తిరుగుతుంటాడు! ఈక్రమంలో సోమవారం రాత్రి చాకలిగుట్టతండా శివారులోని నయారా పెట్రోల్‌బంకు సమీపంలో బైపాస్‌రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఆంజనేయులును షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలోనే ఉంచారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

24 గంటల్లో బంగారు బ్రేస్‌లెట్ రికవరీ

కేశంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గొడవ పడుతుండగా కిందపడిపోయిన బంగారు బ్రేస్‌లెట్‌ను వెతికి 24 గంటల్లో బాధితుడికి అప్పగించి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన గుండేటి నర్సింహ, మండల కేంద్రంలోని శారద గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన తమ బంధువుల విందుకు హాజరయ్యారు. ఈక్రమంలో సమీప బంధువులు నర్సింహపై దాడికి యత్నించారు. ఆయన చేతికి ఉన్న రెండున్నర తులాల బంగారు బ్రేస్‌లెట్ కిందపడి పోయింది. ఈమేరకు కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నరహరి, ఎస్సై రాజ్‌కుమార్‌కు పని అప్పగించారు. ఎస్సై శారద గార్డెన్‌కు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్రేస్‌లెట్ తీసుకున్నవారిని గుర్తించి రికవరీ చేశారు. మంగళవారం ఉదయం బాధితుడికి అప్పగించారు. 24 గంటల్లో తనకు న్యాయం చేసిన పోలీసులకు నర్సింహ కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

మాడ్గుల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగుల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు గమనించి ట్రాక్టర్‌ను అడ్డుకొని డ్రైవర్‌ను అనుమతి పత్రాలు చూపించాల్సిందిగా అడగ్గా.. చూపించలేదు. ఈమేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ కొప్పుల శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

యాచారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్కీ వైన్ షాపులో సోమవారం రాత్రి రూ.30వేల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు సోమవారం రాత్రి పది గంటల సమయంలో మద్యం దుకాణం మూసి ఇంటికి వెళ్లామని, ఉదయం దుకాణం తెరిచేసరికి షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని బాధితుడు అచ్చన శ్రీశైలం తెలిపారు. క్యాష్‌కౌంటర్ పరిశీలించగా రూ.30వేలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి చెప్పారు.

వృద్ధురాలిని.. కొట్టే చంపారు..

చౌదరిగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలకు చెందిన కళావతి(80)ని కుటుంబ సభ్యులే కొట్టి చంపినట్లు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తులో వెల్లడైనట్లు షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య తెలిపారు. మృతిరాలి కుమారుడు ఎల్లారెడ్డి, కోడలు స్వరూప, మనవడు సుధాకర్‌రెడ్డిలు పింఛన్ డబ్బులు దాచుకున్న భూమి అమ్మగా వచ్చిన డబ్బులు ఇవ్వడం లేదని కక్ష పెంచుకొని దారుణానికి ఒడిగటినట్లు తెలిపారు. మనవడు సుధాకర్‌రెడ్డి తన పేరున భూమి మొత్తం రిజిస్ట్రేషన్ చేయలేదనే అక్కసుతో వృద్ధురాలిని తీవ్రంగా కొట్టినట్లు వెల్లడైందన్నారు. కుమారుడు ఎల్లారెడ్డి, కోడలు స్వరూపలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సుధాకర్‌రెడ్డికి అనారోగ్యం కారణంగా రిమాండ్ చేయలేదని.. కోలుకున్న తర్వాత రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన 12 గంటల్లోనే వృద్ధురాలి హత్య నిందితులను రిమాండ్‌కు తరలించారు.

'మహాసభ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, తదితరులు

శంషాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏప్రిల్ 21, 22వ తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఏఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నాలుగో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. యూసుఫ్, ఎం.నర్సింహ, బి.చంద్రయ్య, విలాసరావు, పర్వతాలు, విజయ్, సత్రూ తదితరులు పాల్గొన్నారు.